సాక్షి అనకాపల్లి

7

శుక్రవారం । 16 । మే । 2025

ఈసెట్‌లో టాప్ లేపారు

- సివిల్ ఇంజినీరింగ్‌లో బాలరాజుకు ఫస్ట్ ర్యాంక్
- కెమికల్ ఇంజినీరింగ్‌లో పవన్‌కు ఆరో ర్యాంక్
- సివిల్ ఇంజినీరింగ్‌లో కల్యాణికి ఏడో ర్యాంక్


బాలరాజు


కల్యాణి


పవన్ స్వామికి స్వీటు తినిపిస్తున్న తల్లితండ్రులు చక్రపాణి, హేమ

ఎస్.రాయవరం: ఏపీఈసెట్‌లో జిల్లా విద్యార్థులు రాణించారు. ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి మైలపల్లి బాలరాజు సివిల్ ఇంజినీరింగ్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించాడు. మత్స్యకార కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి గడ్డవల్లూరు పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమా చదివాడు. బాలరాజును కుటుంబ సభ్యులు, తోటి స్నేహితులు అభినందనల్లో ముంచెత్తారు.

మునగపాక: టి.సిరసపల్లికి చెందిన పెంటకోట పవన్ స్వామి కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 200 మార్కులకు గాను 116 సాధించి, రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. తండ్రి పొలమరశెట్టి చక్రపాణి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పవన్ విశాఖలోని కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకున్నాడు.

కె.కోటపాడు: పిండ్రంగి గ్రామానికి చెందిన జాగరపు కల్యాణి ఏపీఈసెట్ ఫలితాల్లో సివిల్ ఇంజినీరింగ్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. ఆమెకు 114 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు సన్యాసమ్మ, దేవుడమ్మలు చిన్న వయస్సులో మరణించారు. దీంతో కల్యాణి అమ్మమ్మ, తాతయ్య పైడితల్లి, రాములమ్మ వద్ద ఉండి చదువుకుంటోంది. గొల్లలపాలెం కేజీబీవీలో చదువుకున్న కల్యాణి టెన్త్‌లో 551 మార్కులు సాధించింది, అనంతరం భీమిలిలో గల మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చదువు పూర్తి చేసి ఏపీఈసెట్ రాసి 7వ ర్యాంకు సాధించింది.

బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నిజమైంది. ప్రజల చెంతకే ప్రభుత్వం వచ్చింది. అన్ని రకాల సేవలను అందించింది. అది నిన్నటి మాట. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన స్వర్ణయుగం అది. వైఎస్ జగన్ సర్కారు నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ విచ్ఛిన్నం. కార్యాలయాలు సగానికి సగం కుదింపు. చిత్తశుద్ధి శూన్యం. సేవలు బహుదూరం. ఇది నేటి చేదు వార్త. ఈ ప్రతిపాదనలు అమలైతే జనానికి మళ్లీ పాత కష్టాలు మొదలైనట్టే.



సచివాలయాలపై కూటమి కుట్ర



వేంపాడులో విలీనం కానున్న అమలాపురం సచివాలయం

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ప్రస్తుతం ఉన్న సచివాలయాలను సగానికి సగం తగ్గించి ప్రభుత్వ పాలన ప్రజలకు దూరం చేసి మళ్లీ పాత రోజులను గుర్తుకు తెచ్చే ప్రయత్నాలకు తెరలేపింది. గుట్టుచప్పుడు కాకుండా సచివాలయాల విలీన ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారుల నుంచి సేకరిస్తోంది. ప్రభుత్వం సచివాలయాలను కుదిస్తే ప్రజలు వివిధ పనుల కోసం మళ్లీ 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం అనేక వ్యయ ప్రయాసలు పడి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు గత సర్కారు గ్రామాల్లో సచివాలయాలు నెలకొల్పి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 12 మంది సిబ్బందిని నియమించింది. రాష్ట్రంలో దాదాపు నాలుగు లక్షల మందికి పైగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కడమే కాక, కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సచివాలయ భవనాల నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున నిధులు వెచ్చించారు. ప్రభుత్వ పథకాలను దరఖాస్తు చేసిన 72 గంటల్లోగా మంజూరు చేసేందుకు పక్కా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

సేవల కుదింపు

జిల్లాలో 522 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రస్తుతం 3844 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తాజాగా ఈ సచివాలయాలను సగానికి కుదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు భోగట్టా. అంటే 261 సచివాలయాలే మిగులుతాయి. సిబ్బందిని సర్దుబాటు చేసి ఇతర ప్రభుత్వ శాఖలకు పంపించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిని మండల కేంద్రాలు, సబ్‌స్టేషన్లు, వ్యవసాయ వెటర్నరీ ఆస్పత్రులకు పంపించి అక్కడ పని చేయిస్తోంది. సచివాలయాల విలీన ప్రక్రియ అమలు చేస్తే మూడు నుంచి నాలుగు పంచాయతీలను కలిపి ఒక సచివాలయం కిందకు తీసుకు వచ్చే ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. నక్కపల్లి మండలంలో 32 పంచాయతీలకు 22 సచివాలయాలు ఉండేవి. విలీన ప్రక్రియలో భాగంగా వీటిని 11కు కుదిస్తూ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.

వేంపాడు వెళ్లాలంట..



మా గ్రామం మండల కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మా గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయడంతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు ఇక్కడే అందేవి. ఇప్పుడు మా సచివాలయాన్ని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేంపాడులో విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇలా అయితే చాలా ఇబ్బంది పడతాం. ప్రభుత్వ నిర్ణయం సరికాదు.

– సూరాకాసుల గోవిందు, అమలాపురం, నక్కపల్లి మండలం

కుగ్రామానికి అన్యాయం



మా గ్రామంలో సచివాలయాన్ని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగితలో విలీనం చేస్తారని తెలిసింది. సరైన రవాణా సదుపాయాలు లేని, ముస్లింలు ఎక్కువగా నివసించే మా గ్రామంలో జగనన్న ప్రభుత్వం సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం సచివాలయాన్ని కాగిత గ్రామానికి తరలించే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మా మారుమూల పల్లెకు మళ్లీ కష్టాలు మొదలైనట్టే.

–గొర్ల గోవిందు, పెదదొడ్డిగల్లు

సచివాలయాల్లో సేవలివీ..

గ్రామ సచివాలయంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయ, హార్టికల్చర్, ఫిషరీస్ కార్యదర్శులు, మహిళా పోలీస్, వుమెన్ వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వీఆర్‌ఏ, కంప్యూటర్ ఆపరేటర్ తదితర సిబ్బందిని నియమించింది. సచివాలయాల ద్వారా దాదాపు 350 రకాల సేవలను ప్రభుత్వం అందించింది. కుల, ఆదాయ నివాస ధ్రువపత్రాలు, జనన మరణ ధ్రువపత్రాలు, రైతులకు అవసరమైన పట్టాదారు పాసుపుస్తకాల దరఖాస్తులు, మోతుబరి సర్టిఫికెట్, వన్ బి, అడంగల్, సర్వే సర్టిఫికెట్లు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, వాణిజ్య, వ్యాపారాలకు సంబంధించిన అనుమతులు, లైసెన్స్‌ల జారీ, డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్‌లు, అమ్మ ఒడి, రైతు భరోసా పథకాలకు దరఖాస్తులు, విద్యాదీవెన, విద్యావసతి, పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు, కొత్తగా పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు, ప్రధాన దేవాలయాల్లో దర్శనాలు, గదుల బుకింగ్ సదుపాయం, ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం దరఖాస్తులు, గృహ అవసరాలకు, వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తులు, రైతులకు విత్తనాలు, ఎరువుల కోసం దరఖాస్తులు ఇలా ప్రజలకు కావాల్సిన అన్ని రకాల వ్యక్తిగత, సామాజిక అవసరాల కోసం దరఖాస్తు చేయడానికి, వాటిని మంజూరు చేయడానికి సచివాలయాలు ఉపయోగపడేవి.



పిడుగుపాటుకు పశువులు మృత్యువాత


మృతి చెందిన మేకలు

రావికమతం: మండలంలో పిడుగుపాటుకు 16 మేకలు, పాడి ఆవు మృత్యువాత పడ్డాయి. వివిధ ప్రాంతాల్లో గురువారం కురిసిన అకాల వర్షంతో భారీగా పిడుగులు పడ్డాయి. రావికమతం శెట్టివారి పాకలు వద్ద వర్షానికి చింత చెట్టు కిందకు మేకలు వెళ్లగా ఆ చెట్టుపై పిడుగు పడడంతో సీరా సాంబ, రమణ, దేవర అప్పలనాయుడు, నమ్మి వెంకటస్వామిలకు చెందిన 14 మేకలు, కేబీపీ అగ్రహారంలో దేవర అప్పారావుకు చెందిన 2 మేకలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టవానిపాలెం గ్రామ శివారు ప్రాంతంలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు మైచర్ల విశ్వనాథం తెలిపారు.

ఏపీఆర్‌డీసీకి దిమిలి విద్యార్థి ఎంపిక


భవానీ ప్రసాద్

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాడు. ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షా ఫలితాలలో కళాశాలకు చెందిన దిమిలి భవానీ ప్రసాద్ రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.ఆర్.టి.సుజాత, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. విద్యార్థి దిమిలి ప్రసాద్ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో ఉన్న ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో బీకాంలో చేరి భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సాధించాలన్నది కోరికగా తెలిపాడు. కళాశాలలో లెక్చరర్లు మంచి సహకారం అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

విచారణాధికారిగా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు

కశింకోట: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్) పరిధిలో విధులను నిర్వహిస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అధికారులపై విచారణ అధికారిగా ఏసీబీ విశాఖ రేంజ్ ఏసీబీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావును నియమించారు. ఈ మేరకు ఏసీబీ ఉన్నతాధికారుల నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.విజయకుమార్ విచారణ అధికారిగా ఉండేవారు. ఆయన స్థానంలో తాజాగా లక్ష్మణరావును నియమించారు. ఆర్‌ఈసీఎస్‌లో అసిస్టెంట్ ప్రాజెక్టు ఇంజనీర్ (ఆపరేషన్స్)గా పనిచేస్తున్న బుద్ధ ప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ సీపాన రమేష్ అగనంపూడి టెక్నికల్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నప్పుడు వివిధ ఆరోపణలు వచ్చాయి. వీరిపై శాఖాపరమైన చర్య తీసుకోవడానికి ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు.

కూటమి మాస్టర్ ప్లాన్


వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన షురూ..

- ఈ నెల 22 నుంచి జూన్ 21 వరకు మళ్లీ అభ్యంతరాల స్వీకరణ
- ఇందులో ప్రజాప్రతినిధుల ప్రయోజనాలకు పెద్దపీట
- వారి స్థిరాస్తి వ్యాపారాలకు అనుగుణంగా సవరణలకు ప్లాన్
- నేతలు చెప్పినట్లే మార్పులు చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు?

విశాఖ సిటీ: కూటమి 'మాస్టర్' ప్లాన్ వేస్తోంది. తమ వారికి లబ్ధి చేకూరేలా బృహత్తర ప్రణాళికలో సవరణలకు సిద్ధమైంది. ప్రజాప్రతినిధుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసేందుకు అడుగులు వేస్తోంది. చెల్లికి పెళ్లి జరగాలి మళ్లీ మళ్లీ.. అన్నట్లు.. 2021లో పూర్తయిన విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన చేపట్టాలని నిర్ణయించింది. గతంలో అశాస్త్రీయంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించారన్న నెపంతో అయిపోయిన పెళ్లికి మళ్లీ బాజాలు వాయించడానికి పూనుకుంది. కేవలం కూటమి నేతల స్థిరాస్తి వ్యాపారాలకు మేలు జరిగేలా మార్పులు, చేర్పులకు ఈ నెల 22 నుంచి మళ్లీ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ ప్రారంభించనుంది.

2021లోనే మాస్టర్ ప్లాన్ పూర్తి

వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బృహత్తర ప్రణాళిక-2041కు ఆమోద ముద్ర వేసింది. వాస్తవానికి 2011లో ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఏళ్లు గడిచినా అది పూర్తి కాకపోవడంతో 2016లో ప్రైవేట్ కన్సల్టెంట్ సంస్థ లీ అసోసియేట్స్‌కు రూ.10 కోట్లకు ఆ బాధ్యతను అప్పగించారు. అయినప్పటికీ 2019కి కూడా అది పూర్తి కాలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాస్టర్‌ప్లాన్‌పై దృష్టి సారించింది. మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమయంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో 46 మండలాలు, 1,312 గ్రామాలు



న్నాయి. ప్రణాళికను రూపొందించేందుకు విశాఖపట్నంలోని 5 వర్గాలు, 45 రెవెన్యూ, 55 మత్స్యకార గ్రామాలు, 13 వార్డులను పరిగణనలోకి తీసుకొని.. సలహాలు, సూచనలు ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా వివరాలు సేకరించారు. అలాగే విజయనగరం జిల్లాలోని 48 రెవెన్యూ, 19 మత్స్యకార గ్రామాలు, 5 వార్డులు, రెండు వర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇందుకోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ, అభ్యంతరాల స్వీకరణలో మొత్తంగా 17,460 అభ్యంతరాలు, సలహాలు వచ్చాయి. వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, ఇతర సంబంధిత విభాగాల అధికారులతో సంయుక్త తనిఖీలు, సందర్శనలు నిర్వహించి వాటిన్నింటినీ పరిశీలించారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. ఆ ప్రాంత భౌగోళిక స్థితిగతులను అనుసరించి విభిన్న కోణాల్లో ఆలోచన చేసి ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు. దానికి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో 2021 నవంబర్ 8న వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041కు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

ప్రజాప్రతినిధులకు లబ్ధి చేకూరేలా?

ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులకు లబ్ధి చేకూర్చాలన్న ఆలోచనతోనే వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునః పరిశీలనకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాల పేరుతో కూటమి నాయకులు సూచించిన మార్పులు, చేర్పులకే పెద్ద పీట వేయాలన్న నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వారు సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవడానికి ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు సమాచారం. వీరి స్థిరాస్తి వ్యాపారాలు, వ్యక్తిగత ఆస్తుల విలువ పెంచుకునేందుకు మాస్టర్ ప్లాన్ రహదారుల ప్రణాళికలను మార్పులు చేసుకోడానికి సిద్ధమవుతున్నట్లు కూటమిలో చర్చ జరుగుతోంది. ప్రధానంగా మధురవాడ నుంచి ఆనందపురం మధ్యలోను అలాగే అనకాపల్లిలో పలు చోట్ల మార్పులు, చేర్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే మాస్టర్ ప్లాన్ మొత్తంగా మార్పు చేసే అవకాశం లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు. కేవలం వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి శాస్త్రీయంగా ఉన్న వాటిని మాత్రమే మార్పులు, చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

మళ్లీ అభ్యంతరాల స్వీకరణ

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌పై ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ నాయకులు ఆరోపణలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్లాన్‌లో మార్పులు చేస్తామని అప్పుడే ప్రకటించారు. అన్నట్లుగానే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మాస్టర్ ప్లాన్-2041ను సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించింది. నాలుగు నెలల్లో కొత్త మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామని అమాత్యులు సైతం ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే బృహత్తర ప్రణాళికను పునః పరిశీలనకు తేదీని ఖరారు చేశారు. ఈ నెల 22 నుంచి జూన్ 21వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న ప్రజలు, భాగస్వాములు, సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించనున్నారు. మాస్టర్ ప్లాన్-2041లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే స్వయంగా గానీ, పోస్టు లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా తెలపవచ్చని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రకటించారు. ప్రజలందరూ మొబైల్ ద్వారా కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.

అందమైన బంధం

భార్యాభర్తల సంబంధాలు చాలా సున్నితమైనవి. అందంగా అల్లుకున్న అనుబంధం చిన్నపాటి కలతలకే ఒక్కోసారి చెదిరిపోయే పరిస్థితి వస్తుంది. ఆ సమయంలో వారితో మాట్లాడి సమాధానపరిస్తే సమస్య ఇట్టే పరిష్కారం అయిపోతుంది. అలాంటి గురుతర బాధ్యతను నెరవేరుస్తోంది అనకాపల్లిలోని ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్. ఆధునికీకరించిన కౌన్సెలింగ్ సెంటర్ భవనాన్ని ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ప్రారంభించారు.

- సత్ఫలితాలను ఇస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్
- మూడు వంతుల కేసులు సుఖాంతం


జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మహిళా ఎస్‌ఐ యమున

సామరస్యతతోనే శాశ్వతం


ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్: పెళ్లి సంబంధం కలవాలంటే పూర్వం ఎన్నో విషయాలను పరిశీలించి నిర్ణయం తీసుకునేవారు. అన్ని కోణాల్లో ఆలోచించే పెద్దలు.. మనసులను ఇచ్చిపుచ్చుకునే అమ్మాయి, అబ్బాయి.. అందరూ మాట్లాడుకొని పెళ్లి సంబంధం కుదుర్చుకునేవారు. ఇప్పటి స్పీడ్ యుగంలో ప్రాధాన్యాలు మారిపోయాయి. పిల్లలే కాదు పెద్దల ఆలోచనా ధోరణిలోనూ ఎంతో మార్పు వచ్చింది. అది దంపతుల కాపురంపై ప్రభావం చూపిస్తోంది. చిన్నచిన్న విషయాలకు కీచులాటలు, స్వల్ప విభేదాలకే విడాకులు ఎక్కువయ్యాయి. దాంతో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రాధాన్యం మరింత పెరిగింది. ఇద్దరితో మాట్లాడి, వారి సమస్య తెలుసుకొని, సర్దిచెప్పడంతో ఎన్నో వివాదాలు పరిష్కారమవుతున్నాయి. అందుకే పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఆధునికీకరించారు. అధునాతన సౌకర్యాలు సమకూర్చారు. గురువారం సెంటర్ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ కుటుంబ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడంలో కౌన్సెలింగ్ సెంటర్ల పాత్ర కీలకమన్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌కు జిల్లాలో 2024లో 667 పిటిషన్లు రాగా 2064 సార్లు, 2025లో 227 పిటిషన్లు రాగా 837 సార్లు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మొత్తం 719 మంది దంపతుల సమస్యలు పరిష్కరించి మళ్లీ కలిసి జీవించడానికి కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా సహాయపడ్డామన్నారు.

కౌన్సెలింగ్ ఎప్పుడు అవసరం..

కుటుంబంలో గొడవలు జరిగినప్పుడు, వైరుధ్యాలు ఏర్పడినప్పుడు, వరకట్న వేధింపులు, లైంగిక హింస, కుటుంబ సభ్యుల మధ్య కమ్యూనికేషన్ సమస్యలు ఉన్నప్పుడు, గృహ హింస, వివాదాలు, ఇతర సమస్యలు ఎదుర్కొన్నప్పుడు ఫ్యామిలీ కౌన్సెలింగ్ అవసరం ఏర్పడుతుంది. అక్కడ తమ సమస్యలను పరిష్కరించుకొనే వీలుంటుంది.

వారి ప్రేమలు, బాధ్యతలను గుర్తు చేస్తాం



ఆవేశంతో అనర్థాలు కొనితెచ్చుకుంటారు. అంతవరకు ఉన్న ప్రేమానుబంధాలను ఆ క్షణంలో మరచిపోతారు. వారికి కౌన్సిలర్లు చెప్పే మాటలు ఎంతో ఉపయోగపడతాయి. వారిని ఆలోచింపచేస్తాయి. పెళ్లి చేసుకొని ఐదు, పదేళ్లు అయిన జంటలు కూడా మా వద్దకు వస్తుంటారు. వారిని కనీసం ఐదారుసార్లు కూర్చోపెట్టి కౌన్సెలింగ్ చేస్తాం. భార్యా, భర్తల గొడవల్లో పిల్లల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని కూడా చెపుతాం. మా పరిధి దాటిన తర్వాత కూడా కౌన్సెలింగ్ చేసి లోక్ అదాలత్ ద్వారా ఇద్దరినీ కలుపుతాం.

– ఇ.శ్రీనివాసులు, డీఎస్పీ, మహిళా పోలీస్ స్టేషన్, అనకాపల్లి

చిన్నారి అదృశ్యం


లోహిత

తుమ్మపాల: పట్టణంలో నాలుగేళ్ల చిన్నారి అదృశ్యం కావడం కలకలం సృష్టించింది. పట్టణ సీఐ విజయకుమార్ అందించిన వివరాలు.. లోకావారి వీధికి చెందిన లోహిత అనే నాలుగేళ్ల చిన్నారి బుధవారం సాయంత్రం వీధిలో ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. బంధువుల ఇళ్లలో వెదికి గురువారం ఉదయానికి కూడా ఆచూకీ లభించకపోవడంతో తల్లి లలిత స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ తుహిన్ సిన్హా

చోడవరం: తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్‌ను ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్కను బహూకరించారు. మరో న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావును కూడా ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన చోడవరం సర్కిల్, పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.


అదనపు జిల్లా జడ్జికి మొక్కను బహూకరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జాబ్‌మేళాలో 450 మంది ఎంపిక


జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు


నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

యలమంచిలి రూరల్: యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగులు నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 25 కంపెనీల్లో ఉద్యోగాలకు 1,500 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరిలో 450 మందిని ఆయా కంపెనీల సెలెక్టర్లు ప్రాథమికంగా ఎంపిక చేసుకున్నారు. అంతకుముందు ఉదయం జాబ్ మేళాను నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ. గోవిందరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పి. చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

జనవాణికి అధికారులు ఎలా వెళ్తారు?

సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సత్యనారాయణ

మునగపాక: జనసేన పార్టీ కార్యాలయంలో అధికారులు జనవాణి కార్యక్రమం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. మునగపాకలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమం అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలే గాని జనసేన కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు ఎలా స్వీకరిస్తారన్నారు. అధికారులకు ఎటువంటి గైడెన్స్ లేకున్నా పార్టీ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావడం తప్పిదమన్నారు. అధికారులు జనసేనకు తొత్తుగా వ్యవహరించడం విచారకరమన్నారు. పార్టీ నాయకులతో కలిసి అధికారులు ప్రజా వాణిలో పాల్గొంటే భవిష్యత్‌లో ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, టెక్కలి జగ్గారావు, ఎంఎస్ తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుపై ఆటో బోల్తా

- డ్రైవర్ మృతి


మృతి చెందిన లక్ష్మీవరప్రసాద్

ఎస్.రాయవరం: మండలంలోని నీలాద్రిపురం సమీపంలో అడ్డురోడ్డు – నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గురువారం ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ఎస్‌ఐ విభీషణరావు వివరాల ప్రకారం.. తిమ్మాపురం గ్రామానికి చెందిన శానాపతి లక్ష్మీవరప్రసాద్(32) భార్యాపిల్లలతో తన స్వగ్రామం నుంచి చినగుమ్ములూరు వెళ్తుండగా, రోడ్డుపై గతుకులు కారణంగా ఆటో బోల్తా పడింది. ఈ క్రమంలో ఆటో కింద పడిపోయిన లక్ష్మీవరప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అడ్డురోడ్డు సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు నాలుగేళ్లుగా తిమ్మాపురం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెంలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చినగుమ్ములూరులో వివాహానికి వెళ్లేందుకు వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రాష్ట్రస్థాయి వుషు పోటీల్లో చోడవరం క్రీడాకారులకు పతకాలు

చోడవరం : రాష్ట్ర స్థాయి వుషు మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో చోడవరం క్రీడాకారులు పతకాలు సాధించారు. కర్నూల్‌లో ఈనెల 12నుంచి 14వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి ఉషా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చోడవరం గణేష్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. జూనియర్స్ 45 కేజీల విభాగంలో తేజ స్వరూప్ బంగారు పతకం సాధించారు. ఉమెన్స్ సీనియర్స్ 60 కేజీల విభాగంలో లావణ్య రజత పతకం, 65 కేజీల విభాగంలో సాయి లక్ష్మి కాంస్య పతకం సాధించారు. వీరు త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి పాల్గొంటారని కోచ్ పుల్లేటి గణేష్ తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

నైపుణ్యతకు మెరుగు!


ఆర్ట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు


క్రాఫ్ట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- స్వయం ఉపాధి వైపు అడుగు
- టీటీసీ కోర్సుపై ఆసక్తి చూపుతున్న యువత
- ఆర్ట్, క్రాఫ్ట్ శిక్షణతో ఉద్యోగ అవకాశాలు
- వేసవిలో 42 రోజుల పాటు శిక్షణా తరగతులు


భారత్-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ఓ విద్యార్థి గీసిన చిత్రం

విశాఖ విద్య: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తోంది. ఉన్నత విద్యను అభ్యసిస్తూనే.. సత్వర ఉపాధి లక్ష్యంగా నైపుణ్యతతో కూడిన స్వల్పకాలిక టెక్నికల్ కోర్సుల వైపు ఆసక్తి కనబరుస్తోంది. ఇటువంటివారి కోసం విద్యాశాఖ ఏటా వేసవిలో 'టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్'(టీటీసీ) కోర్సులను ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. 42 రోజుల వ్యవధి గల ఈ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 42 ఏళ్ల వరకు వయస్సు గల వారు అర్హులు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ కోర్సులను అభ్యసించేందుకు 180 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం నగరంలోని ప్రభుత్వ క్వీన్ మేరీ హైస్కూల్‌లో ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు.

ఎన్‌ఈపీ అమలుతో టీటీసీకి డిమాండ్

విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉండేవి. జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో తప్పనిసరిగా ఆర్ట్, క్రాఫ్ట్ సబ్జెక్టు టీచర్లను నియమించాలనే నిబంధన పెట్టారు. టీటీసీ కోర్సు చేసిన వారు మాత్రమే ఆయా పోస్టులకు అర్హులు కావటంతో డిమాండ్ పెరిగింది. మానసిక, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే అంశాలతో కూడిన సబ్జెక్టులు కావటంతో వచ్చే ఏడాది నుంచి కోర్సు వ్యవధి 42 రోజులకు బదులుగా 6 నెలలు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.


భార్యాభర్తలకు ఒకే డ్రెస్‌కోడ్ ఉండేలా సీతారాముల చిత్రాలతో తీర్చిదిద్దిన డ్రస్సులు

నైపుణ్యతతో కూడిన శిక్షణ

ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన శిక్షణ తరగతులు జూన్ 11వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులను నిర్వహిస్తున్నారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఆరుగురు టీచర్లు.. సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు మరో ఇద్దరు టీచర్లను నియమించారు. వీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నైపుణ్యతతో కూడిన శిక్షణ అందిస్తున్నారు.

ఉపాధి కోసం..



నా డిగ్రీ చదువు అనివార్య కారణాలతో మధ్యలోనే ఆగిపోయింది. నాకు ముగ్గురు పిల్లలు. క్రాఫ్ట్‌లో ఇప్పటికే లోయర్, హయ్యర్ కంప్లీట్ చేశాను. టీటీసీ పూర్తి చేస్తే ప్రైవేటు స్కూళ్లలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నేను నేర్చుకున్న విద్యలో మరింత నైపుణ్యత పొందుతూ.. ఇంటి వద్ద మరి కొంతమందికి శిక్షణ ఇస్తున్నాను.

– కర్రి చంద్రిక, గవరపాలెం, అనకాపల్లి జిల్లా

బొమ్మలు వేయడం ఇష్టం



నేను బీటెక్ కంప్యూటర్ సైన్సు పూర్తి చేశాను. ఎంటెక్‌లో చేరేందుకు ఎంట్రన్స్ రాస్తున్నాను. చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం అంటే ఇష్టం. నాన్న ప్రోత్సాహంతో ఆర్ట్‌లో శిక్షణ పొందుతున్నాను. ఆర్ట్ కోర్సులో లోయర్, హయ్యర్ ఇప్పటికే పూర్తి చేశాను. మరింత నైపుణ్యత పొందేందుకు టీటీసీ శిక్షణ ఉపయోగపడుతుంది.

–ఎం.మీనాక్షి, సుజాతనగర్, విశాఖ జిల్లా

ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నాం..



టీటీసీ కోర్సు ప్రాధాన్యత దృష్ట్యా శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఆర్ట్, క్రాఫ్ట్‌లో నైపుణ్యత గల ఉపాధ్యాయులను శిక్షణ ఇచ్చేందుకు నియమించాం. ప్రాక్టికల్స్‌లో విద్యార్థులంతా భాగస్వామ్యులను చేసి, వారి ఫెర్ఫార్మెన్స్ అంచనా వేయాలని ఆదేశాలు ఇచ్చాం. తరగతులను రోజూ పర్యవేక్షిస్తున్నాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా


శిక్షణ భాగంగా వేసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు


చీరపై వేసిన డిజైన్ చూపిస్తున్న మహిళ

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు


మద్యం సీసాలతో పట్టుబడిన నాగమణి

మునగపాక: మండలంలో మడకపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న మహిళ నాగమణిని గురువారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మడకపాలెంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు దాడులు చేశారు. ఈ దాడిలో యలమంచిలి నాగమణి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

రూ.8.3 లక్షలు ఏ మూలకూ చాలవు

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పెంచాల్సిందే
- ఏపీఐఐసీ నిర్వాసితుల డిమాండ్
- చందనాడలో అఖిలపక్ష సమావేశం


అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వీసం, అప్పలరాజు తదితరులు


సమావేశానికి హాజరైన రైతులు, నిర్వాసితులు

నక్కపల్లి: పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.8.30 లక్షలు ఏమూలకూ సరిపోవని, ప్యాకేజీ పెంచాల్సిందేనంటూ పలువురు అఖిలపక్ష నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. గురువారం చందనాడలో నిర్వాసితుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరఫున కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం తరఫున జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నిర్వాసితుల తరఫున గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. వీసం రామకృష్ణ, అప్పలరాజులు మాట్లాడుతూ పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో ప్రభుత్వం పూర్తి న్యాయం చేయలేదన్నారు. డీఫారం రైతులకు కేవలం భూములకు మాత్రమే నష్టపరిహారం చెల్లించి ఫలసాయానికి పరిహారం ఇవ్వలేదన్నారు. ఇక సాగుదార్లకు ఒక్క పైసా పరిహారం ఇవ్వలేదన్నారు. నివాస ప్రాంతాలు, పశువుల షెడ్లు కోల్పోయిన వారికి నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు ఇవ్వాల్సిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అరకొరగా ప్రకటించారన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలకు పెంచాలి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.8.30 లక్షలు, ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఈ ఎనిమిది లక్షలు పునాదులు తీయడానికి కూడా సరిపోవన్నారు. రైతులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున ప్రత్యేక ప్యాకేజీ చెల్లించాలన్నారు. ప్యాకేజీ విషయంలో న్యాయం జరగకపోతే నిర్వాసితుల తరఫున ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఎన్నికల ముందు నిర్వాసితుల తరఫున ఆందోళనలు చేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారన్నారని విమర్శించారు. 2014లో టీడీపీ నాయకుల మాటలు నమ్మి రైతులు కోర్టుల్లో కేసులు ఉపసంహరించుకుని ఏపీఐఐసీకి భూములు ఇచ్చారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. చందనాడ, డీఎల్‌పురం, అమలాపురం, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాలకు చెందిన నిర్వాసితులు, రైతులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని ఆటోడ్రైవర్ దుర్మరణం


బంగారు రమణ(ఫైల్)

పీఎంపాలెం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కూరగాయలు రవాణా చేస్తున్న ఆటో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ వెల్లడించిన వివరాలివి. ఆనందపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బంగారు రమణ(41) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజూ మాదిరిగానే గురువారం తెల్లవారుజామున ఆనందపురం కూరగాయల మార్కెట్ నుంచి కూరగాయలను తన ఆటోలో వేసుకుని నగరంలోని పెదవాల్తేరుకు బయలుదేరాడు. తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో ఎండాడ కూడలికి సమీపంలోని వరాహగిరి కాలనీ ఎదురుగా జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రమణ నడుపుతున్న ఆటో ముందు అతివేగంగా వెళుతున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేశాడు. ఊహించని ఈ పరిణామానికి రమణ తన ఆటోను అదుపు చేయలేక లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న నరసింగరావు అనే వ్యక్తి స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

రాష్ట్రంలో అడ్డగోలు భూ కేటాయింపులు ఆపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అడ్డగోలు భూ కేటాయింపులు తక్షణమే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ విచ్చేసిన ఆయన గురువారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ విశాఖలో ఉర్సా కంపెనీకి ఎకరా 99 పైసలకు కేటాయించిన సీఎం చంద్రబాబునాయుడు, ప్రజలంతా వ్యతిరేకిస్తే ఇప్పుడు ఎకరా రూ.1.50 కోట్లని చెప్పడం దారుణమన్నారు. ఎవరీ ఉర్సా? అని అడిగినా ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. విశాఖలో ఐటీ కంపెనీలు రావాలని సీపీఎం కోరుతోందని, అయితే గతంలో అదానీ డేటా సెంటర్‌కు 130 ఎకరాలు కేటాయించినా, ఇంత వరకూ అతీగతీ లేదన్నారు. అమరావతిలో రాజధాని కోసం గతంలో తీసుకున్న వేల ఎకరాలు చాలవా? అని అక్కడి ప్రజలే అడుగుతున్నారని, మరో 44 వేల ఎకరాలు ఇటీవల తీసుకోవడం దేనికని ప్రశ్నించారు. విశాఖ, అమరావతిలో రాజధాని కోసం కేటాయించిన భూములు రియల్ ఎస్టేట్ కోసం తప్ప, ప్రజలకు ఏం మేలు జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక ప్యాకేజీ తర్వాత నిలబడుతుందనుకున్న ప్రజలు, కార్మికుల్లోని ఆశలు నేడు సన్నగిల్లుపోతున్నాయన్నారు. తాజాగా ప్లాంట్‌లో నిర్బంధ చర్యలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 13న లంచ్ సమయంలో ప్లాంట్‌లో మీటింగ్ పెట్టుకున్న నలుగురు కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, ఇద్దరిని సస్పెండ్ చేయడాన్ని తీవ్ర చర్యగా పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఇన్ని దారుణాలు జరుగుతుంటే స్థానిక(గాజువాక) టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీను, ఎంపీ శ్రీభరత్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

విశాఖ-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం విశాఖ-చర్లపల్లి మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. చర్లపల్లి-విశాఖ(07441) స్పెషల్ ఈ నెల 17న మధ్యాహ్నం 2 గంటలకుబయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.35 గంటలకు విశాఖ చేరుకుంటుంది. విశాఖ-చర్లపల్లి(07442) స్పెషల్ ఈ నెల 18వ తేదీన రాత్రి 11 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 11.40 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

కృష్ణస్వామికి డాక్టరేట్ ప్రదానం


కృష్ణస్వామికి డాక్టరేట్ పట్టాను అందిస్తున్న త్రిదండి శఠకోపముని రామానుజ జీయర్‌స్వామి

పాయకరావుపేట: శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానం ముఖ్య అర్చకులు ఈయుణ్ణి కృష్ణస్వామికి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మెర్‌లెన్స్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీవిల్లిపుత్తూరు శ్రీమనవాళ మహాముని పీఠాధిపతి త్రిదండి శఠకోపముని రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా పాండురంగ ఆలయ ప్రాంగణంలో డాక్టరేట్‌ను అందించారు. అనంతరం కృష్ణస్వామిని ఘనంగా సన్మానించారు. ఉపమాక దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టిముక్కల ప్రసాద్, పలువురు ఆధ్యాత్మికవేత్తలు, మహిళలు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించకుంటే స్తంభింపచేస్తాం..

ఉక్కునగరం: తప్పుడు సస్పెన్షన్లు, షోకాస్ నోటీసులను 24 గంటల్లో ఉపసంహరించుకోకుంటే స్టీల్ ప్లాంట్‌ను స్తంభింపచేస్తామని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మే 13వ తేదీన బీఎఫ్ విభాగంలో మీటింగ్ హాజరయ్యారనే సాకుతో నలుగురు కార్మికులను సస్పెండ్ చేయడంతో పాటు ఏడుగురు కార్మికులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. కార్మిక సమావేశాలకు హాజరుకాకుండా బెదిరించడానికే ఈ విధంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ ఉత్తర్వులు ఏ విధంగాను చెల్లవన్నారు. యాజమాన్యం వైఖరికి నిరసనగా ఈనెల 16 నుంచి 19 వరకు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారన్నారు. 16న ఉదయం బీసీ గేటు వద్ద, 17న ఉదయం మెయిన్ గేటు వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 18న అన్ని నిర్వాసిత కాలనీల్లో ర్యాలీలు చేస్తామని తెలిపారు. 19న జాతీయ కార్మిక సంఘాల నాయకులతో సాయంత్రం 5.30కు మెయిన్ గేటు వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు.

స్టాఫ్ నర్సుల ఎంపిక జాబితా విడుదల

- 22, 23 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన
- ప్రస్తుతం 124 పోస్టులు మాత్రమే భర్తీ: ఆర్డీ

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియలో భాగంగా గురువారం ఎంపిక జాబితా విడుదలైంది. ఈ నెల 22, 23 తేదీల్లో రేసవానిపాలెంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. రోజుకు 60 మంది చొప్పున రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ జరుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి తెలిపారు. ఫలితాలను https://cfw.ap.nic.in/, https://nagendrasvst.wordpress.com/ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. మొత్తం 124 పోస్టులకు గాను 115 మంది అభ్యర్థులతో ఎంపిక జాబితాను విడుదల చేశారు. తొమ్మిది పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద కేటాయించామని, సంబంధిత అధికారుల నుంచి జాబితా అందిన తర్వాత వీటిని భర్తీ చేస్తామని ఆర్డీ తెలిపారు. గత ఆరు నెలలుగా సాగుతున్న ఈ భర్తీ ప్రక్రియలో పోస్టుల సంఖ్యలో మార్పులు అభ్యర్థులను గందరగోళానికి గురిచేశాయి. తొలుత ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 నర్సు పోస్టులకు దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత మరో 264 పోస్టులు కలవడంతో మొత్తం 370 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల నుంచి మొత్తం 8,309 దరఖాస్తులు వచ్చాయి. తాజాగా పోస్టుల సంఖ్య ఒక్కసారిగా తగ్గిపోయింది. మొత్తం 370 పోస్టులకు అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్, ప్రీ ఫైనల్ జాబితాలు విడుదల చేసిన తర్వాత.. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఆదేశాల మేరకు 246 పోస్టుల భర్తీని నిలుపుదల చేశారు. దీంతో గురువారం కేవలం 124 నర్సు పోస్టులకు మాత్రమే ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ పి.రాధారాణి తెలిపారు.

బస్సు ఢీకొని కలాసీ మృతి

అక్కిరెడ్డిపాలెం: ఓ కలాసీ తలపై నుంచి ఫార్మా బస్సు వెళ్లిపోవడంతో దుర్మరణం చెందాడు. వేపగుంటకు చెందిన బొజ్జా రాంబాబు(40) కలాసీ. ఆటోనగర్ సర్వీస్ రోడ్డు సమీపంలోని బి-బ్లాక్ వద్ద వాహనాలు మరమ్మతులు చేసే ప్రాంతంలో రాత్రి సమయాల్లో నిద్రిస్తుంటాడు. గురువారం వేకువ జామున అక్కడే బల్లపై నిద్రిస్తుండగా, ఫార్మా కంపెనీ బస్సు డ్రైవర్ రివర్స్ చేస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సు రాంబాబు తలపై నుంచి వెళ్లడంతో.. ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



ఆలయం వార్షికోత్సవం సందర్భంగా అందంగా అలకరించిన గౌరీపరమేశ్వరులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధిలో నూతనంగా ఆధునికీకరించిన గౌరీపరమేశ్వరుల ఆలయం తృతీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గౌరీ పరమేశ్వరుల కళ్యాణం రేజేటి గోప అప్పలచార్యులు పర్యవేక్షణంలో ఘనంగా జరిగింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట : మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కశింకోట, బయ్యవరం, విసన్నపేట, తేగాడ, వెదురుపర్తి గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా దేవతమ్మ పుట్టుక ఉత్సవం



పండగ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో వెలసి ఉన్న దేవతమ్మ పుట్టుక ఉత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇక్కడి అమ్మ వారి ఆలయం నుంచి డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా శారదానది అవతల పొలాల్లో కొలువై ఉన్న అమ్మవారి పుట్ట వద్దకు వెళ్లి ఉత్సవ నిర్వాహకులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతి రూపాన్ని ఊరేగింపుగా బాణసంచా కాలుస్తూ తీసుకువచ్చి ఆలయంలో నిలిపారు. పూజలు చేశారు. వేగి ఇంటి పేరు కలిగిన కుటుంబీకులతో పాటు స్థానికులు అమ్మవారిని దర్శించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 348 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,150	4,730
రెండో రకం	4,000	4,300
మూడో రకం	3,630	3,630

అనకాపల్లి సినిమాలు

రాజా : రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1: శుభం
సత్యనారాయణ స్క్రీన్-2: జగదీక వీరుడు అతిలోక సుందరి
పర్తిసాయి : హిట్-3
షిర్డీసాయి సింగల్
వెంకటేశ్వర : సీఎం పెళ్లాం
శ్రీ సత్య : సారంగపాణి జాతకం
రామచంద్ర : తుడురుమ్

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయం రక్త నిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 16 యూనిట్లు, బీ పాజిటివ్ -10 యూనిట్లు, ఓ పాజిటివ్ -14 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ లోకేష్‌ను 9703619706 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

అత్యవసరం అయితే ఆపుకోవాల్సిందే..!



ఆర్డీవో కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం

- ప్రభుత్వ కార్యాలయాల్లో కొరవడిన టాయిలెట్స్ సదుపాయం
- ఇబ్బందులు పడుతున్న జనం

అనకాపల్లి టౌన్: జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లిలో పలు ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా టాయిలెట్స్, మరుగుదొడ్లు లేవు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు, ఉద్యోగులదీ అదే పరిస్థితి. అత్యవసరం అయితే ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. జిల్లాగా రూపాంతరం చెందిన తర్వాత ప్రతి రోజూ ఆర్డీవో, తహసీల్దార్, మండల ప్రజా పరిషత్, పోలీస్ స్టేషన్, జీవీఎంసీ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది పలు దరఖాస్తులతో కార్యాలయాలకు వస్తుంటారు. వీరు కార్యాలయాలకు వచ్చిన సమయానికి అధికారులు అందుబాటులో ఉండరనేది బహిరంగ రహస్యమే. వారి గురించి గంటల గంటలు ఎదుచూడక తప్పదు. ఈ క్రమంలో వీరు అత్యవసరంగా టాయిలెట్స్‌కి వెళ్ళాలంటే కుదరదు. ఆయా కార్యాలయాలలో అవి అందుబాటులో లేవు. ఆ అవసరం తీర్చుకోవాలంటే ఆపుకోవాల్సిందే. లేదా ఏదోవిధంగా చాలా ఇబ్బదులు పడి తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఈ కార్యాలయాకు వచ్చే ప్రజలకు కనీసం మంచినీటి సౌకర్యం కూడా ఉండడం లేదు. మండుతున్న ఎండలలో కార్యాలయాలకు వచ్చే ప్రజలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధర వెచ్చించి మంచి నీటిని కొనుక్కొంటున్నారు. తక్కువ ఖర్చుతో పరిష్కరించే గలిగే ఈ అత్యవసర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



జీవీఎంసీ కార్యాలయం

పారిశుధ్యం మెరుగుకు స్వచ్ఛ భారత్ పేరిట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగానే నిధులు వెచ్చిస్తున్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో ఎక్కడా వీటి ఉద్దేశం అమలు కావడం లేదు. స్వచ్ఛ భారత్ పేరిటా ఊరూరా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని చెపుతున్న అధికారులు ప్రభుత్వ కార్యాలయాలలో వాటిని నిర్మించలేక పోతున్నారు. దీంతో ఇటు జనంతో పాటు అటు ఉద్యోగులకూ ఇబ్బందులు తప్పడం లేదు.



పోలీస్ స్టేషన్

కనీస సదుపాయాలు లేవు



వివిధ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి తమ పిల్లలతో వస్తుంటాం. అధికారుల కోసం చాలా సేపు వేచి చూడాల్సి వస్తుంది. అటువంటి సమయంలో అత్యవసంగా టాయిలెట్‌కి వెళ్లాలంటే ఎక్కడికి వెళ్లాలో తెలియడంలేదు. కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు.

–ఎస్ శంకర్, బయ్యవరం.

టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



జీవీఎంసీ కార్యాలయానికి వివిధ పనులపై వస్తుంటాను. అత్యవసరంగా టాయిలెట్‌కి వస్తే ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. నాలాగే ఇక్కడకు వచ్చే జనం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం దృష్టి సారించి ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్‌లు నిర్మించాలి.

–బి.సత్యనారాయణ, అనకాపల్లి

సాంకేతిక పరిజ్ఞానంతో

ట్రాఫిక్ పర్యవేక్షణ



ట్రాఫిక్ సీఐకి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్: ట్రాఫిక్ పర్యవేక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్‌పి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజలకు కనిపించేలా విజిబుల్‌గా ఉండాలని ఆయన ఆదేశించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో భాగంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, వెలుతురు లేని ప్రాంతాలలో సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం, ప్రధాన జంక్షన్ల వద్ద మైక్‌ల ద్వారా హెచ్చరికల పంపిణీ చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని సూచించారు. రద్దీ నివారణకు అవసరమైన పార్కింగ్ స్థలాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ, ఎస్‌బి సిఐ బాల సూర్యారావు, ఎస్‌ఐ శేఖర్‌లు పాల్గొన్నారు.

జనాభా ప్రకారం నిధులు కేటాయించాలి



16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు డాక్టర్ సౌమ్యకాంతి ఘోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి : గ్రామాల అభివృద్ధికి 15వ ఫైనాన్స్ నిధులు 2011 జనాభా లెక్కలు ప్రకారం ఒక్కో మనిషికి రూ.117 ఇస్తున్నారని, అనకాపల్లి మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 84 వేల మంది నివసిస్తే, 2025 జనాభా లెక్కల ప్రకారం గ్రామాల్లో లక్ష 24 మంది నివసిస్తున్నారని, 16వ ఫైనాన్స్ కమిషన్‌లో గ్రామాల్లో ఒక్కో మనిషికి రూ.900 కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. తిరుపతిలో 16వ ఆర్థిక కమిషన్ సమావేశంలో కమిషన్ సభ్యుడు డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్‌కు గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో జనాభాకు నిధులు కేటాయించాలని, గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం కమిషన్ నిధులతో పనులు జరుగుతున్నాయని, పనులు జరిగే సమయంలో రూ.లక్ష నిధులతో అభివృద్ధి చేసే సమయంలో రూ.లక్షలో జీఎస్టీగా 18 శాతం ఇవ్వడం జరుగుతుందని, మండల పరిషత్ నిధులు గ్రామాల్లో ఖర్చు చేసే సమయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో జీఎస్టీ తొలగించాలని కోరారు. 15వ ఫైనాన్స్ నిధులు టైడ్, అన్‌టైడ్ రెండు విభాగాలు ఇస్తుందని, టైడ్‌లో 40 శాతం నిధులు తాగునీరు, పరిశుభ్రతకు కేటాయిస్తున్నారని, అన్‌టైడ్ గ్రాంట్ నిధులు గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రుల అభివృద్ధి ఇతర వినియోగాలకు ఖర్చు చేస్తున్నారని, 15 ఫైనాన్స్ నిధులు టైడ్, అన్‌టైడ్‌గా కాకుండా ఒకే విధంగా నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

సీహెచ్ఓల నిరసన



మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ వద్ద సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

అనకాపల్లి: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ జిల్లా ప్రతినిధులు జి.యమున, బి.సుధాకర్, ఎ.శైలజా, పి.రేవతి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 సంవత్సరం పార్లమెంట్‌లో నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు ద్వారా ప్రతి గ్రామానికి ఒక ఎంబీబీఎస్ వైద్యులు ఉండాలని అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిందన్నారు. గ్రామాల్లో అప్పటి నుంచి నేటి వరకూ కాంట్రాక్టు పద్ధతిలో విధుల నిర్వహిస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేశారు.

ఆంగ్లభాషపై విద్యార్థులకు అవగాహన



తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కశింకోట: తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఆంగ్ల పదాలతో వాక్య నిర్మాణంపై అవగాహన కలిగించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల 15వ రోజులో భాగంగా గాయత్రి స్కూలు ప్రిన్సిపాల్ వై. నగేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానవంతులు కావాలన్నారు. క్రమ శిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థులతో నీతి కథలు చదివించారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వర్షంతో వారపుసంత వెలవెల



కశింకోటలో వర్షం వల్ల కొనుగోలు దారులు లేక వెలవెలబోయిన వారపు సంత

కశింకోట: కశింకోట ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం గాలులతో వర్షం కురిసింది. దీంతో ఇక్కడి వారపు సంత వెలవెలబోయింది. లోతట్టు ప్రాంతాలు నీటిమయం అయ్యాయి. ఆకాశం ఆకస్మాత్తుగా మేఘావృతమై గాలులు వీస్తూ ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో కశింకోట వారపు సంతకు కొనుగోలుదారులు తగ్గిపోగా, వచ్చిన వారు సరుకులు కొనుగోలు చేయకుండానే ఇంటి ముఖం పట్టారు. ముమ్మరంగా వ్యాపారం జరిగే సమయంలోనే వర్షం పడి అమ్మకాలను దెబ్బతీసిందని వ్యాపారులు వాపోయారు. వర్షం తగ్గాక సాయంత్రం కొనుగోలుదారులు క్రమేపి రావడంతో అమ్మకాలు ముమ్మరమయ్యాయి. వర్షం వల్ల కొనుగోలుదారులు ఆశించినంతగా రాకపోవడంతో తక్కువ ధరకు తాజా సరకు పాడైపోకుండా విక్రయించి నష్టపోవలసి వచ్చిందని పలువురు వ్యాపారులు వాపోయారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంతం, మండల కార్యాలయానికి వెళ్లే రోడ్డులో నీరు చేరింది. దీంతో రాకపోకలకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది చెందారు.

పీఆర్‌వో షణ్ముఖకు ఏయూ డాక్టరేట్



డాక్టరేట్ ఉత్తర్వులను అందుకుంటున్న పీఆర్ఓ రేగాన షణ్ముఖ

తుమ్మపాల: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి, కలెక్టరేట్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో ప్రజా సంబంధాల అధికారి (పీఆర్ఓ)గా పనిచేస్తున్న రేగాన షణ్ముఖకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆంధ్ర కేశరి విశ్వవిద్యాలయం ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య డి.వి.ఆర్ మూర్తి పర్యవేక్షణలో డిఫ్యూజన్ ఆఫ్ ఇన్నోవేషన్ అమోంగ్ షెడ్యూల్ క్యాస్ట్ పాపులేషన్ 'ఏ స్టడీ ఆఫ్ మోసూరు విలేజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై జరిగిన పరిశోధనకు ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ నుంచి గురువారం ఆయన డాక్టరేట్ ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను విభాగాచార్యులు, పరిశోధకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట: నర్సీపట్నం డివిజన్ చెట్టుపల్లి ఫీడర్ రోలుగుంట సెక్షన్‌లో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు నిమిత్తం ఈ ఫీడర్ పరిధిలోని కాముడిపాలెం, నిండుగొండ, గురందొరపాలెం, వడ్డిప గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని తెలిపారు.

దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతు పనుల్లో భాగంగా భాగంగా పినకోట 11 కేవీ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు తెలిపారు. శ్రీరాంపురం, పెదగంగవరం, వాలాబు, జీనబాడు, పినకోట, కివర్ల, జాలాడు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. బోయిలకింతాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ కారణంగా జగన్నాథపురం, గవరవరం, కొత్తపెంట, ములకలాపల్లి, వేచలం, బి.కింతాడ, కలిగొట్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని ఏఈ శంకరరావు కోరారు.

ఈదురు గాలుల బీభత్సం

- సత్యవరం గ్రామం అతలాకుతలం
- నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు
- నివాస స్థలాల పైకప్పు రేకులు ఎగిరిపోయిన వైనం
- ఇళ్లలో తడిసిపోయిన ధాన్యం
- సత్యవరంలో నేలకొరిగిన చెట్లు
- స్తంభించిన జనజీవనం



సత్యవరంలో నేల కొరిగిన విద్యుత్ స్తంభం



సత్యవరం ప్రధాన రహదారిపై నేల కొరిగిన విద్యుత్ స్తంభం



చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో అతలాకుతలమైన సత్యవరం గ్రామం

మాడుగుల : మండలంలో గురువారం సాయంకాలం ఈదురుగాలులుతో కూడిన వర్షం బీభత్సం జరిగింది. మండలంలో సత్యవరం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లతో కూడిన విద్యుత్ స్తంభాలు 8 వరకు నేల కొరిగాయి. వొమ్మలి, జంపెన, రహదారుల్లో పలు చోట్ల చెట్లు విరిగిపోవడంతో సత్యవరం గ్రామం నుంచి ప్రజలకు ఎటూ వెళ్లలేని పరిస్థితి దాపురించింది. గ్రామంలో విద్యుత్ సదుపాయంలేక, రహదారులు చెట్లు కొమ్మలతో నిండిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. గ్రామంలో ఉన్న చెట్లు మొత్తం నేల కొరగడంతో గ్రామంలో కూడా జనం తిరగలేక విద్యుత్ లేక అంధకారంలో ఉండిపోయారు. గురువారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ లేకపోవడంతో తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సత్యవరం గ్రామానికి చెందిన రైతు యాలం రామునాయుడుకు చెందిన రేకుల ఇంటిపై చెట్లు ఒరిగిపోవడంతో పై కప్పు రేకులు విరిగిపోయి ఇంటిలో ఉన్న సుమారు 30 బస్తాల ధాన్యం, ఇతర వస్తువులు తడిసి ముద్దయ్యాయి. సుమారు రూ. 2 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. అదే గ్రామానికి చెందిన జాజిబొగ్గల రమణమ్మ రేకుల ఇంటిపై రేకులు గాలికి ఎగిరిపోవడంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగింది. అలాగే సత్యవరం ప్రధాన రహదారిపై మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యాశాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: విద్యార్థుల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ ప్రారంభించారు. దీనిపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో మండల విద్యాశాఖ అధికారులు వేసవి శిక్షణను పాఠశాలలో జరగకుండా నిలిపివేశారు. దీంతో నిర్వాహకులు తమ దృష్టికి తీసుకువచ్చారని సంపత్‌కుమార్ తెలిపారు. రాజకీయ, మతపరమైన , ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు పాఠశాలల ఆవరణలో నిర్వహించరాదని ఆదేశాలున్నాయే తప్ప, విద్యార్థులకు యోగా, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం వంటి వాటిలో శిక్షణ నిర్వహించ వద్దని ఆదేశాలు లేవన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కిపైగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణలు జరుగుతున్నాయని స్వయంగా జేసీ జాహ్నవి ప్రకటించారన్నారు. సోమవారంలోగా పాఠశాలలో యథావిధిగా వేసవి శిక్షణ జరిగేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే విద్యాశాఖ అధికారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

కొడవటిపూడి పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్

కోటవురట్ల: కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవో నంబరు 117 ప్రకారం ఉమ్మడి విశాఖ జిల్లాలో 33 హైస్కూళ్లు మంజూరు కాగా, వాటిలో కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్‌కు స్థానం దక్కింది.

వైభవంగా కామేశ్వరమ్మతల్లి పండగ

మాకవరపాలెం : కామేశ్వరమ్మతల్లి పండగను వైభవంగా నిర్వహించారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో వెలసిన కామేశ్వరమ్మ తల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుంచే ఆలయం వద్దకు చేరుకుని దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతోపాటు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి గ్రామంలో వివిద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ పండగలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందతో సర్పంచ్ కృష్ణంనాయుడు

రోలుగుంట : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన అహారం అందుతుందని ఆ శాఖ నర్సీపట్నం డివిజన్ ఇంచార్జి ఎం.టి.నాగేశ్వరరావు అన్నారు. మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోగురువారం ఆ శాఖ మండల ఇంచార్జి నిర్మల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగు, ఆకు కూరల సాగు, అధిక దిగుబడుల సాధన వంటి అంశాలను వివరించారు. రైతుల సందేహాలను మండల ఇంచార్జి నిర్మల నివృత్తి చేశారు. నవధాన్యాలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వివరాలు అందజేసి ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో కలసి సర్పంచ్ కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ముసలినాయుడు నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. నీటి పారుదల శాఖ నుంచి దేవాడ రమణ, అధికారులు కలసి ప్రకృతి సాగులో ఉత్తమ రైతులను సన్మానించారు.

ఘనంగా వాడనర్సాపురం దుర్గాలమ్మ పండగ



వాడనర్సాపురం దుర్గాలమ్మ వారు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం వాడనర్సాపురంలో దుర్గాలమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన బంధువులు రావడంతో గ్రామంలో సందడి వాతావరణం ఏర్పడింది.

ఘనంగా పైడితల్లమ్మ పండగ

ఎస్.రాయవరం: ఉప్పరాపల్లిలో పైడితల్లి అమ్మవారు జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఇలవేల్పుగా కొలిచే ఈఅమ్మ వారికి వేకువజాము నుంచి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి భారీ మందుగుండు సామగ్రి వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.